క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ముదినేపల్లి రూరల్ : మండలంలోని అన్నవరం డ్రెయిన్‌పై ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ రహదారి పనులను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ముదినేపల్లి నుంచి దేవరం వెళ్లేందుకు అన్నవరం డ్రెయిన్ వంతెన శిథిలావస్థకు చేరి ఇటీవల కూలిపోయింది. దీంతో దేవరం, ముదినేపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిషత్ నిధులతో డ్రెయిన్‌లో తూములు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను ఎంపీపీ సత్యనారాయణ పరిశీలించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) వంతెన నిర్మాణ ఆవశ్యకతను కలెక్టర్‌కు తెలియజేసి రూ.81 లక్షలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు చెప్పారు. పనులను పరిశీలించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, నాయకులు శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, రాచూరి కుమార్, పేర్ని పృథ్వీ ఉన్నారు.

జీవనజ్యోతి చెక్కు అందజేత

మండవల్లి: తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ సహజ మరణం పొందడంతో అతని భార్య నాగరాణికి సర్పంచ్ చేబ్రోలు సుధారాణి చేతుల మీదుగా పీఎం జీవనజ్యోతి బీమా యోజన చెక్కును మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి.దుర్గారావు గురువారం అందజేశారు. తక్కెళ్లపాడులో గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి రూ.2 లక్షల చెక్కును అందజేయడం అభినందనీయమని సర్పంచ్ సుధారాణి, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. గ్రామ ప్రముఖుడు సీహెచ్ మాశిలామణి, ఫిషర్మన్ సొసైటీ అధ్యక్షుడు దాసరి ప్రసాద్, ఉప సర్పంచ్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కురుమద్దాలి(పామర్రు): కురుమద్దాలికి చెందిన పార్టీ నేత నత్త నాగేశ్వరరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మృతుని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మొవ్వ మండలం వేములమాడలో వైఎస్సార్ సీపీ నాయకులు బాబు తల్లి మురారి సత్యనారాయణమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే నివాళులర్పించారు. పెద్దారాయుడు తోటలో తాత వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆయనతోపాటు నేతలు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయం

పామర్రు: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పామర్రు పాల శీతల కేంద్రం పరిధిలోని సాలెంపాలెం సొసైటీ సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతు సంక్షేమం మన మతం–అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా పాల సొసైటీలను సందర్శిస్తున్నామని చెప్పారు. యూనియన్ ద్వారా సబ్సిడీలపై అందజేస్తున్న దాణా, తెలగపిండి, గడ్డిజాతి మొక్కలు తదితరాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ వి.సాయి వెంకట రమణ, ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు మల్లికార్జునరావు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పాల శీతల కేంద్రం మేనేజర్ గోపీనాథ్, సంఘ అధ్యక్షులు నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సమాజంలో మమేకం కావాలి



ఎలకుర్రు(పామర్రు): మానసిక దివ్యాంగులు సమాజంలో మమేకం కావడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.వసుంధర అన్నారు. కేడీబీ ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో గురువారం ఘనంగా ఎక్సెసబుల్ ఎవేర్‌నెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను తీర్చిదిద్దడానికి కేడీబీ పాఠశాల కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్‌లో ప్రత్యేక శిక్షణ, డ్యాన్సు టీచర్ సాయంతో నృత్యాలను నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

నిడుమోలు(మొవ్వ): సంక్షేమ పథకాలతో పాటు, ప్రజోపయోగ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గూడు కట్టుకున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్.. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ అందరి సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దృష్టికి ప్రజలు అంతర్గత రహదారులు కావాలని, ఇళ్ల స్థలాల సమస్యలను తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ కొమరగిరి అంజిలి, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ చిన్నం రత్నాబాయి, ఉపసర్పంచ్ డొక్కు మురళి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, పార్టీ స్థానిక కన్వీనర్ గొరిపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడివాడ టౌన్(నందివాడ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన పురిటిపాటి నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరి కాకుండా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుడికి అత్యంత వేగంగా చేరుతున్నాయన్నారు. నాగిరెడ్డి గత నెల 14న ప్రమాదవశాత్తు మరణించ ఈ నెల 18కి రూ. 5 లక్షలు బ్యాంకులో జమ చేశారని తెలిపారు. ఇది ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, సర్పంచ్ సర్రెళ్ల రత్నకుమారి, మండల సచివాలయాల కన్వీనర్ దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తోట నాగరాజు, వైస్ సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం



ఆర్‌ఆర్‌ఆర్ స్కీం ప్రారంభిస్తున్నట్లు తెలుపుతున్న కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: త్వరలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాలను పట్టణంలో ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనలతో పట్టణంలోని రాజేంద్రనగర్, ఎన్టీఆర్ కాలనీ, ముగ్గుబజార్, ఇందిరానగర్ కాలనీ, యానాదుల కాలనీ, కోతిబొమ్మ సెంటర్, చెంచుపేట, మందపాడు, పాత మున్సిపల్ కార్యాలయం, రాయల అప్పారావు వీధి తదితర 10 ప్రాంతాల్లో సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న పాత దుస్తులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, చెప్పులను ఈ సెంటర్‌కు అందజేస్తే వాటి అవసరం ఉన్న చోట్ల అందిస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టి.వి. రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు దిశ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల రక్షణకు ఎన్నో కార్యక్రమాలు రూపొందించారని నగరంలోని 48, 26 డివిజన్లకు చెందిన మహిళా పోలీసులు ఎస్. మాధవి, జాన్‌బెహన్ అన్నారు. వాటిలో దిశ యాప్ సమాచారం, దిశ పోలీస్ స్టేషన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం 11వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్ల వల్ల మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. సెల్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో ఎస్ఓఎస్ టచ్ చేయాలన్నారు. ఈ సమాచారం సమీపంలోని దిశ పోలీస్‌స్టేషన్‌కు చేరుతుందని, వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆపదలో ఉన్న వారిని రక్షిస్తారని చెప్పారు. అలాగే గృహ హింసకు సంబంధించి మహిళలకు మహిళా పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరుగుతుందన్నారు. చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ ప్రశంసాపత్రాలను అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు

పెడన: లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు అన్నారు. ఉరివి గ్రామ సచివాలయం పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలు ఇచ్చి చాలా రోజులు అయిన నేపథ్యంలో పునాదులు కూడా వేయని వారు తక్షణం ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఎవరైనా కాంట్రాక్టరు వస్తే వారికి పనులు అప్పగించి తమ ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ గంధం విజయలక్ష్మి, సర్పంచ్ సురేష్, హౌసింగ్ ఏఈ మాధవి, పంచాయతీ కార్యదర్శి అహ్మద్ , వైఎస్సార్ సీపీ నాయకులు గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఎన్నో ప్రయోజనాలు

జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి



కూరగాయల పంటను పరిశీలిస్తున్న పార్థసారథి, శివప్రసాద్ తదితరులు

కోనేరుసెంటర్: ప్రకృతి సాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి కె. పార్థసారథి అన్నారు. బందరు మండలం నెలకుర్రు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన రైతు గొరిపర్తి వీరవెంకట్రావు తన పొలంలో వేసవిలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో కూరగాయల సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నాడు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్‌తో కలిసి గురువారం వెంకట్రావు పొలాన్ని సందర్శించారు. రైతు వెంకట్రావును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రైతులు వేసవిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందన్నారు. రైతు వెంకట్రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఘన జీవామృతం, నవ ధాన్యాలు సాగు చేస్తున్నామని చెప్పాడు. ఈ ఏడాది కూరగాయలు పండించడంతో పాటు పశువుల మేత కోసం జొన్న, పిల్లిపెసర వేశానని చెప్పాడు. తద్వారా రోజుకు రూ. 1000 వరకు ఆదాయం లభిస్తుందన్నాడు. పండించిన కూరగాయలను పొలం వద్దనే విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నానని వివరించాడు. కార్యక్రమంలో పలువురు రైతులు, వీఏఏలు ప్రశాంత్, దీపిక పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

పెడన: పురపాలక సంఘ పరిధిలో మెప్మా విభాగంలో 18వ వార్డు రిసోర్స్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న బండారు అనురాధ పరుగులో మరిన్ని విజయాలు సాధించాలని మెప్మా పీడీ విజయలక్ష్మి అన్నారు. పరుగుల అనురాధగా గుర్తింపు తెచ్చుకుని అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంతో ఆమెను మెప్మా ఉన్నతాధికారులు గురువారం సన్మానించారు. విజయవాడ గుణదలలో మెప్మాలోని ఆర్‌పీలకు మెప్మా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. విశాలాక్షి మాట్లాడుతూ అనురాధ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐబీ సుధారాణి, ఎల్‌హెచ్ సత్యవతి, బీఎల్ రాధా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపరిశీలన

పామర్రు: ఉపాధి హామీ పథకం నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉంటుందని ఏపీఎం పోలు రాజు తెలిపారు. మండలంలో జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,252 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారన్నారు. నిమ్మకూరు, పసుమర్రు, ఐనంపూడిలో చెరువు అభివృద్ధి పనులు, గట్లు పటిష్ట పరిచే పనులు జరుగుతున్నాయన్నారు. అన్ని గ్రామాల పరిధిలో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. కచ్చితమైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో పంట బోదె అభివృద్ధి పనులను గురువారం ఉపాధి కూలీలు నిర్వహించారు. రూ.1. 30 లక్షల వ్యయ అంచనాతో పంట బోదె అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఎంటీఏ నల్లా నవీన్ తెలిపారు. 65 మంది కూలీలు పనులు చేసినట్టు చెప్పారు.

నాట్య కళాపీఠాన్ని సందర్శించిన న్యాయమూర్తి



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠాన్ని నంది గామ సబ్ జడ్జి ఖాసిం గురువారం కుటుంబ సభ్యులతో సందర్శించారు. కళాపీఠం ప్రిన్స్‌పాల్ వేదాంతం రామలింగ శాస్త్రి ద్వారా కూచిపూడి నాట్య విశేషాలను, చరిత్రలో నిలిచిపోయిన నాట్య కళాకారుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాపీఠం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలను వీక్షించారు.

తామరకొల్లులో అన్నసమారాధన

కైకలూరు: హనుమజ్జయంతి సందర్భంగా తామరకొల్లు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కైకలూరు, ముదినేపల్లి ఎంపీపీలు అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో 2000 పైచిలుకు భక్తులు పాల్గొన్నారు.. కార్యక్రమంలో సర్పంచ్ భట్రాజు శివాజీ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, నాయకులు ధర్మరాజుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిగురుకోటలో..

ముదినేపల్లి రూరల్ : హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని చిగురుకోట సెంటర్లో వేంచేసియున్న శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సమారాధనను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభిస్తారని చెప్పారు. పరిసర గ్రామాల భక్తులు సమారాధనలో పాల్గొనాలని కోరారు.

మెరుగైన ఆరోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్



కైకలూరు: మెరుగైన ఆరోగ్య సంరక్షణకే 'ఫ్యామిలీ డాక్టర్' అని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. దానిగూడెంలో ప్రజలకు పీహెచ్‌సీ డాక్టరు అన్నపూర్ణ వైద్య సేవలను గురువారం అందించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యంనినాదంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, వార్డు సభ్యురాలు బుజ్జిమ్మ, గ్రామస్తులు క్రీస్తురాజు, కటికిన రఘు, గుడిపాటి జగన్నాథం పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణం పూర్తి చేయాలి

ముదినేపల్లి రూరల్ : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన పనుల్లో ముదినేపల్లి సెంటర్లో డ్రెయిన్ నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు కోరారు. ముదినేపల్లిలో గురువారం మాట్లాడుతూ సెంటర్లో రహదారి విస్తరించేందుకు గతంలో ఉన్న డ్రెయిన్లను ధ్వంసం చేసి కొత్త నిర్మాణం చేపట్టారన్నారు. వీటిని పూర్తిచేసి అవస్థలు తొలగించాలని జాతీయ రహదారి అధికారులకు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

అందరి సమస్యలు పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: అందరి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు స్థానిక ఎమ్మెల్యే నానిని గురువారం ఆయన నివాసంలో కలిశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సొమ్ము ఇప్పించాలని, ఇంజినీరింగ్ కళాశాలలో విద్య ఇబ్బందిగా ఉందని తదితర సమస్యలతో పలువురు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పట్టణానికి చెందిన వేదపండితులు చలమలచర్ల మురళీకృష్ణమాచార్యులు కుటుంబ సభ్యులతో వచ్చి తమ కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానపత్రికను అందజేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



జమీగొల్వేపల్లిలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు



కపిలేశ్వరపురంలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

పామర్రు: గణితంపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపితే మిగిలిన సబ్జెక్టుల్లో మంచి మార్కులు వస్తాయని పామర్రు శాఖ గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి అన్నారు. జిల్లా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వేసవి శిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులు గణిత టేబుల్స్‌పై అవగాహన కల్పించారు.

జమీగొల్వేపల్లిలో..

విద్యార్థులు ధ్యానం చేస్తే ఆధ్యాత్మిక జ్ఞానం వస్తుందని ధ్యాన గురువు సిరిపురపు లలితాప్రసాద్ తెలిపారు. జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా ధ్యానంపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, సీహెచ్ చంద్రశేఖర ఆజాద్, గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ జీఎస్ఎం ప్రసన్న కుమారి విద్యార్థులకు ఆరోగ్యసూత్రాలు పాటించే విధానాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్ తదితర ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెనిగళ్ల ప్రతాప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు అవసరం

గుడివాడటౌన్: విద్యార్థి దశలో ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎంవీఎస్ సత్యనారాయణబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ భాష అభ్యసనంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది టి.ప్రవల్లిక, వి. సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

మండవల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ప్రకృతి వనరులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన ప్రకృతి వనరులు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రకృతి వనరులను దుర్వినియోగం చేయకూడదన్నారు. గ్రంథాలయాల్లోని గ్రంథాలను పఠించి ఎందరో మహోన్నతులై, ఉన్నత శిఖరాలు చేరారని తెలిపారు.

చిన్నచెరువు అభివృద్ధికి పటిష్ట చర్యలు



చిన్న చెరువు గట్టు పనులు పరిశీలిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: చిన్నచెరువు అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పంచాయతీ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రజల కోసం పార్కు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి నీటిని నింపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంగినేని పోతురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రాంబాబు, నాగిరెడ్డి కొండ, శ్యామయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడు.. చినకొట్టాడవాసి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్ సమీపంలో బస్‌షెల్టర్‌లో బుధవారం మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభించింది. మృతుడి బంధువులు గురువారం ఏలూరు చేరుకుని గుర్తించారు. కైకలూరు మండలం చినకొట్టాడ గ్రామానికి చెందిన సైదు మాణిక్యాలరావు (55)గా గుర్తించారు. భీమడోలులోని తమ బంధువులను చూసేందుకు వెళ్లే నిమిత్తం ప్రయాణమై అనారోగ్యం కారణంగా ఆశ్రం ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని, బస్‌షెల్టర్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఎండవేడిమితో తీవ్ర అనారోగ్యానికి గురైన మాణిక్యాలరావు మృతిచెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సాగు నీటి వృథాకు అడ్డుకట్ట

కంకిపాడు: సాగు నీటి వృథాకు అడ్డుకట్ట వేసేందుకు ఇరిగేషన్‌శాఖ చర్యలు తీసుకుంది. నీటి విడుదల సమయంలో కట్టలు దాటుకుంటూ పంట పొలాలు ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారానికి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుతం బెడ్ వర్క్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇరిగేషన్ శాఖ కంకిపాడుసెక్షన్ పరిధిలో ప్రొద్దుటూరు చానల్ ఉంది. కంకిపాడు లాకులు నుంచి ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం మీదుగా నీటి ప్రవాహం జరుగుతోంది. సాగుకు నీటిని విడుదల చేసిన క్రమంలో ప్రొద్దుటూరు చానల్‌లో వంతెన ఎగువ, దిగువ ప్రాంతాల్లో కాలువ కట్ట అంచులు దాటుకుంటూ పంట పొలాల్లోకి నీరు ప్రవహించేది. దీంతో పంట పొలాలు ముంపునకు గురై రైతులు ఆర్థికంగా నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఉన్నతాధికారులతో చర్చించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో సాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ మేరకు గతేడాది ప్రొద్దుటూరు చానల్‌లో 260 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మెయింటెనెన్స్ గ్రాంటు కింద రూ.59 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సాంకేతిక అనుమతులు వచ్చే సరికి కాలువలకు సాగు నీటిని విడుదల చేశారు. దీంతో పనులు చేపట్టేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో ఇరిగేషన్ శాఖ రిటైనింగ్ వాల్ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వంతెన దిగువన బెడ్ వర్క్ చేపట్టారు. సాగునీటి విడుదల నాటికి రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తామని ఇరిగేషన్ కంకిపాడు సెక్షన్ ఏఈ వీరాంజనేయులు తెలిపారు.

లడ్డూ వేలం

కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాలు మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు 13 కిలోల స్వామి వారి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన చిటికినేని సాంబశివరావు (శ్రీను) రూ.81 వేలకు పాడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును కమిటీ నిర్వాహకులు సత్కరించారు.